

శభాష్ 'మేధ'ర్షి!

- సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో నునపర్తి విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్
- 283/300 మార్కులు సాధించిన రెడ్డి మేధర్షి
- జాతీయస్థాయిలో 43వ ర్యాంకు

- 8లో



రెడ్డి మేధర్షి

కోడ్ అమలులో వివక్ష!

వైసీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగుల తొలగింపులో అధికారులు మీనమేషాలు

- అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు



కోట్నివీధిలో తొలగించని వైసీపీ ఫ్లెక్సీ, దుకాణంపై హోర్డింగ్

అనకాపల్లి టౌన్, మార్చి 17:

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జిల్లాలో కొన్నిచోట్ల అమలు కావడంలేదు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం సాయంత్రం విడుదల చేయగా, మరుక్షణం నుంచే కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు, పోస్టర్లు తదితర వాటిని 24 గంటల్లోకి తొలగించాలని ఆదేశించింది. కానీ జిల్లాలోని పలుచోట్ల ఆదివారం సాయంత్రానికి కూడా వీటిని తీసేయలేదు. ముఖ్యంగా అధికార వైసీపీకి చెందిన ఫెక్సీల తొలగింపులో ఎన్నికల అధికారులు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనకాపల్లి నియోజకవర్గ ఎన్నికల రిట్నరింగ్ అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన జాహ్నవి ఆదేశాల మేరకు అధికారులు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాల తొలగింపు పనులు చేపట్టారు. కానీ వీధుల్లో ఇబ్బడి ముబ్బడిగా వున్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఆదివారం సాయంత్రానికి కూడా తొలగించలేదు. కోట్నివీధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మకు ఇటీవల వైసీపీ జెండా రంగులతోపాటు ఎన్నికల గుర్తు అయినా ఫ్యాన్ బొమ్మలు వేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' రెండు రోజుల క్రితం ఈపీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా సున్నం వేయిస్తామని చెప్పారు. శనివారం సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మపై వేసిన రంగులుగానీ, అదే ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు వేసిన వైసీపీ జెండా రంగులుగానీ తొలగించకపోవడం గమనార్హం.

పరవాడ మండలంలో..

పరవాడ, మార్చి 17: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ మండల కేంద్రంలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను ఆదివారం సాయంత్రం వరకు ... మిగతా 8వ పేజీలో



పరవాడలో తొలగించని వైసీపీ ఫ్లెక్సీలు

విద్యుదాఘాతంతో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

- ఎన్నికల అధికారుల ఆదేశాలతో ఫ్లెక్సీ తొలగిస్తుండగా ప్రమాదం



డెక్క చిరంజీవి (ఫైల్)

దేవరాపల్లి, మార్చి 17: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తొలగిస్తుండగా గ్రామ సచివాలయం ఉద్యోగం ఒకరు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ సంఘటన ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపిన సమాచారం మేరకు ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా వున్నాయి.

విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లి గ్రామానికి చెందిన డెక్క చిరంజీవి (34) అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను ఆదివారం సాయంత్రంలోగా తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా ఎన్నికల అధికారుల ... మిగతా 8వ పేజీలో

అమర్‌పై అసంతృప్తి!

'గాజువాక'లో తొలి సమావేశానికే కీలక నేతలు డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, నామమాత్రంగా హాజరైన కార్యకర్తలు

- హాజరుకాని ఎమ్మెల్యే నాగిరెడ్డి, తాజా మాజీ సమన్వయకర్త చందు, పలువురు కార్పొరేటర్లు
- అంతంతమాత్రంగానే వచ్చిన కార్యకర్తలు
- బోసిపోయిన సమావేశ మందిరం

గాజువాక, మార్చి 17: గాజువాక నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి, మంత్రి అమర్‌నాథ్‌పై నేతల అసంతృప్తి తొలి సమావేశంలోనే బయటపడింది. తనను అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ఆదివారం ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో సమావేశం ఏర్పాటు చేస్తున్నానని, దీనికి పార్టీ శ్రేణులు హాజరుకావాలని ముందుగానే సమాచారం ఇచ్చినప్పటికీ ఎమ్మెల్యే నాగిరెడ్డితో సహా కీలక నేతలు, ఏడుగురు కార్పొరేటర్లు కూడా డుమ్మా కొట్టారు. దీంతో గాజువాక టికెట్‌ను అమర్‌కు ఇవ్వడంపై వైసీపీలో అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

గత ఎన్నికల్లో అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గుడివాడ అమర్‌నాథ్‌ను, వైసీపీ అధిష్ఠానం ఈసారి ఎన్నికల్లో అనూహ్యంగా గాజువాక అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఆయన మొదటిసారిగా ఆదివారం నియోజకవర్గం స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే సమావేశానికి నేతలతో పాటు కేడర్ హాజరు కావాలని ఆయనతోపాటు టికెట్ దక్కని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కూడా పిలుపునిచ్చారు. అయితే తన ఇంటికి సమీపంలోనే ఈ ఫంక్షన్ హాల్ ఉన్నప్పటికీ.. నాగిరెడ్డితో సహా కీలక నేతలెవరూ సమావేశానికి హాజరుకాలేదు. మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వార్డు స్థాయి నాయకులు మాత్రమే హాజరయ్యారు. అంతేకాకుండా పార్టీ కేడర్ కూడా అంతంతమాత్రంగానే వచ్చారు. దీంతో సమావేశ మందిరం వెలవెలబోయింది. గాజువాక టికెట్ లభించిన తరువాత అమర్‌నాథ్ తొలిసారి నిర్వహించిన ఈ సమావేశానికి సీనియర్ నేతలే కాకుండా అత్యధిక కార్పొరేటర్‌లు పాల్గొనకపోవడంపై నియోజకవర్గంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

ఏడుగురు కార్పొరేటర్‌లు డుమ్మా

గాజువాక నియోజవర్గం పరిధిలో ఎనిమిది మంది వైసీపీ కార్పొరేటర్లు (65వ వార్డు బొడ్డు నరసింహపాత్రుడు, 66వ వార్డు ఇమ్రాన్ అహ్మద్, 68వ వార్డు గుండాపు వెంకటసాయి అనూష, 70వ వార్డు ఉరుకూటి రామచంద్రరావు, 71వ వార్డు రాజాన రామారావు, 73వ వార్డు భూపతిరాజు సుజాత, 74వ వార్డు తిప్పల వంశీరెడ్డి, 85వ వార్డు ఇల్లపు వరలక్ష్మి) వున్నారు. అమర్‌నాథ్ ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఏకంగా ఏడుగురు కార్పొరేటర్లు ముఖం చాటేశారు. 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత మాత్రమే హాజరయ్యారు.

చల్లారని అసమ్మతి

గాజువాక వైసీపీ సమన్వయకర్తగా కొనసాగుతున్న తిప్పల దేవన్‌రెడ్డిని కాదని కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును పార్టీ అధిష్ఠానం నియమించి, అతనినే అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి అసమ్మతి జ్వాలలు రేగుతున్నాయి. పార్టీ నిర్ణయాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా తనకు గాని, తాను సూచించిన వ్యక్తికి గాని టికెట్ ఇవ్వాలంటూ అనుచరవర్గంతో కలిసి తాడేపల్లిలో ప్రయత్నాలు చేశారు. దీంతో సామాజిక సమీకరణల నేపథ్యంలో చందును సమన్వయకర్తగా నియమించామని, ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని అభ్యర్థిగా ప్రకటించాలని నాగిరెడ్డి పట్టుబట్టారు. ఈ క్రమంలో కొద్దిరోజులు నియోజకవర్గమంతటా మేయర్‌తో కలిసి పర్యటించి, జనానికి పరిచయం కూడా చేశారు. అయితే గాజువాకలో కాపు సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉండడం కలిసి వస్తుందని టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పైరవీలు చేశారు. మరో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఇదిలా ఉండగా సమన్వయకర్తగా నియమించిన చందును మార్చిన పార్టీ అధిష్ఠానం ఊహించని విధంగా మంత్రి అమర్‌నాథ్‌ను రంగంలోకి తెచ్చింది. అయినప్పటికీ నేతల అసంతృప్తి చల్లారకపోవడంతో అమర్ నిర్వహించిన తొలి సమావేశం పేలవంగా జరిగింది.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ

59 శాతం మంది అభ్యర్థులు హాజరు



ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిలాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 35 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పేపర్-1 పరీక్ష ఉదయం పది నుంచి 12 గంటల వరకు, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు జరిగాయి. పరీక్షకు మొత్తం 19,668 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 11,679 (59 శాతం) హాజరుకాగా, 7,985 మంది (41 శాతం) గైర్హాజరయ్యారు. కేంద్రంలోకి స్మార్ట్‌వాచ్, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేకపోవడంతో సిబ్బంది నిశితంగా పరిశీలించి లోపలకు పంపించారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్షల తీరును జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పరిశీలించారు. శివాజీపాలెంలోని ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, మెయిన్‌క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల, జ్ఞానాపురం సోఫియా కళాశాలలోని కేంద్రాలను సీపీ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ సందర్శించారు.

పక్కాగా కోడ్ అమలు

'ఎన్నికల' పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలి

- అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి ఆదేశం
- కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి పట్టన్‌శెట్టి, హాజరైన అధికారులు

అనకాపల్లి, మార్చి 17 (అనకాపల్లి):

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయా పనులను ప్రాధాన్యతక్రమంలో సకాలంలో చేపట్టాలని స్పష్టం చేశారు. నామినేషన్ పత్రాలు సమకూర్చుకోవడం, పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకం, మొదలైన పనులు చేపట్టాలన్నారు. ఎన్నికల అనుబంధ కమిటీలు వారికి నిర్దేశించిన నియమావళిని తప్పకుండా అమలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాలు, భవనాల్లో రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించి ఫొటోలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు వుండకూడదని స్పష్టం చేశారు. ప్రైవేటు స్థలాల్లో కూడా ఈ నిబంధన వర్తిస్తుందని చెప్పారు. అనంతరం వివిధ ఎన్నికల విభాగాల నోడల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశామని, నోడల్ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్ఓ దయానిధి, అనకాపల్లి ఆర్డీఓ చిన్నికృష్ణ, నర్సీపట్నం ఆర్డీఓ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లి మండలం వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన...

అనంతరం కలెక్టరేట్‌లో ఎన్నికల మానిటరింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ రూమ్ పనులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పరిశీలించారు. అన్ని నియోజకవర్గాల నుంచి వచ్చే సమాచారాన్ని ఇక్కడి నుంచి ఎన్నికల సంఘానికి పంపుతారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి ప్రసాదరావు, ఎన్నికల ఖర్చు విభాగం అధికారి సత్యనారాయణ, ఎంసీఎంసీ నోడల్ అధికారి జీవీ లక్ష్మి, డీపీఆర్ఓ సాయిబాబా తదితరులు వున్నారు.

'సువిధ' యాప్ ద్వారా అనుమతులు: ఎస్పీ

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ప్రచారం చేసుకోవాలంటే పోలీసు శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని, లేకపోతే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తగు చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అన్ని రకాల అనుమతులు 'సువిధ' యాప్ ద్వారా ఇస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం, సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాల ... మిగతా 8వ పేజీలో

సర్వం సిద్ధం

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- 108 కేంద్రాలు, 23,583 మంది విద్యార్థులు
- 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు నిర్వహణ
- ఒక్కనిమిషం దాటినా 'నో ఎంట్రీ'
- 8.45 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి



ఎలమంచిలి కొత్తపేట ఉన్నత పాఠశాలలో డెస్కులపై విద్యార్థుల హాల్ టికెట్ నంబర్ల స్టిక్కర్లు అతికిస్తున్న హెచ్ఎం రమణయ్య

అనకాపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యా శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. 108 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు 23,583 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 21,259 మంది (బాలురు-10,873, బాలికలు-10,386), ప్రైవేటు విద్యార్థులు 2,324 మంది వున్నారు. టైమ్ టేబుల్ ప్రకారం నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. మాస్‌కాపీయింగ్ జరగకుండా ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులను 8.45 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలికి అనుమతి ఉండదని డీఈఓ ఎంవీ లక్ష్మమ్మ స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని తెలిపారు. ఇన్విజిలేటర్లు, పరీక్షల నిర్వహణ అధికారులకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.11
సహరి (మంగళ)	4.49

చెరకు రైతు సజీవదహనం

పొలంలో చెత్తకు నిప్పు పెట్టడంతో ఎగిసిన మంటలు

- పక్కనే ఉన్న విత్తనం చెరకు తోటకు వ్యాపించిన అగ్నికీలలు
- చెరకును కాపాడుకునే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన రైతు
- బుచ్చెయ్యపేటలో విషాదం



సుంకర పోతురాజు (ఫైల్‌ఫొటో)

బుచ్చెయ్యపేట, మార్చి 17: అగ్నికి ఆహుతి అవుతున్న విత్తనం చెరకు తోటను కాపాడుకునే ప్రయత్నంలో మంటలు చుట్టుముట్టడంతో ఓ రైతు సజీవదహనం అయ్యాడు. బుచ్చెయ్యపేటలో ఆదివారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన రైతు సుంకర పోతురాజు(68) సమారు ఒకటిన్నర ఎకరా భూమిలో చెరకు సాగు చేశాడు. ఎకరం పొలంలో పండిన చెరకును గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి సరఫరా చేశాడు. మిగిలిన అర ఎకరంలో చెరకును వచ్చే సీజన్‌కు విత్తనం కోసం ఉంచుకున్నాడు. చెరకు నరికిన పొలంలో ఆకులు, ఇరత వ్యర్థాలు ఎండిపోవడంతో ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి చెత్తకు నిప్పు పెట్టాడు. ఈ సమయంలో గాలులు అధికంగా వీయడంతో మంటల మరింత ఎగిసి, విత్తనం కోసం ఉంచుకున్న చెరకు తోటకు వ్యాపించాయి. దీంతో తోట లోపలికి వెళ్లి మంటలను అదుపు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాడు. కానీ అగ్నికీలలు చుట్టుముట్టడంతో బయటకు రాలేకపోయాడు. శరీరమంతా కాలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. చెరకు తోటకు వెళ్లిన పోతురాజు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతోపాటు, చెరకు తోట నుంచి మంటలు వస్తుండడంతో భార్య చెల్లయ్యమ్మ, కుమార్తెలు, కుమారులు వెంటనే అక్కడకు వెళ్లారు. సజీవ దహనమైన పోతురాజును చూసి కన్నీరుమున్నీరు అయ్యారు. చెరకు చెత్తకు నిప్పు పెట్టిన సమయంలో చుట్టుపక్కల పొలాల్లో రైతులెవరూ లేకపోవడంతో పోతురాజు ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు వాపోయారు. కాగా రైతు పోతురాజు మృతితో బుచ్చెయ్యపేటలో విషాదఛాయలు అలము కున్నాయి. మృతుడి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

సముద్రంలో పడవ బోల్తా... మత్స్యకారుడి మృతి

- వెంకటనగరం వద్ద ఘటన



గరికిన కొత్తబాబు (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట రూరల్, మార్చి 17: మండలంలోని వెంకటనగరం వద్ద సముద్రంలో పడవ బోల్తా పడిన ఘటనలో మత్స్యకారుడు మృతిచెందాడు. ఈ ప్రమాదం నుంచి ఇతని కుమారుడు, మరో మత్స్యకారుడు ప్రాణాలతో బయటపడ్డారు. వీరిద్దరితోపాటు పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

వెంకటనగరం పంచాయతీ రాజానగరం గ్రామానికి చెందిన గరికిన కొత్తబాబు (52), తన కుమారుడు తాతాజీ, మరో మత్స్యకారుడు సిరిపల్లి రామదాసుతో కలిసి ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో వెంకటనగరం తీరం నుంచి పడవపై చేపల వేటకు సముద్రంలోకి బయలుదేరారు. సుమారు 100 మీటర్ల దూరం వెళ్లిన తరువాత భారీ కెరటం రావడంతో పడవ బోల్తా పడింది. దీంతో ముగ్గురూ నీటిలో మునిగిపోయారు. తాతాజీ, రామదాసు ఈదుకుంటూ ఒడ్డుకు వస్తుండగా, కొత్తబాబు ఊపిరాడక నీటిలో మునుగుతూ, తేలుతూ కనిపించాడు. దీంతో ఇద్దరూ కలిసి ఒడ్డుకు తీసుకువచ్చారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే ప్రాణాలు వదిలాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. కుమారుడు తాతాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ జోగారావు తెలిపారు.


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు





ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట


ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


జానపద నృత్యాలు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


యువత కేరింత


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..

క్రైం... crime news

అనుమానాస్పదంగా వివాహిత మృతి

మాడుగుల రూరల్, మార్చి 17 : మండలంలోని ఓ గ్రామంలో వివాహిత ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందింది. ఇందుకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం వివరాలివి. లోవపొన్నవోలు గ్రామంలో రెడ్డి ప్రకాశ్, భవాని (28) దంపతులు తమ ఐదేళ్ల పాప, మూడేళ్ల బాబుతో పాటు భవాని తల్లి వరహాలమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. డ్రైవింగ్, కూలి పనులు చేస్తూ ప్రకాశ్ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భవానీ తల్లి వరహాలమ్మ, ప్రకాశ్ కొద్దిరోజుల కిందట కూలి పనుల నిమిత్తం పడమట ప్రాంతానికి వలస వెళ్లారు. గ్రామంలో ఆదివారం శుభకార్యం ఉండడంతో శనివారం ఉదయం వరహాలమ్మ, ప్రకాశ్ లోవపొన్నవోలు గ్రామానికి విచ్చేశారు. శనివారం రాత్రి ప్రకాశ్‌కు, భవానికి మధ్య గొడవ జరిగినట్టు తెలుస్తోంది. కాగా ఆదివారం ఉదయం వరకు ఇంటి వద్దనే ఉన్న భవాని మధ్యాహ్నం పన్నెండు గంటల తర్వాత నుంచి కనిపించక పోవడంతో వెతకసాగారు. ఇంటికి సుమారు వంద మీటర్ల దూరంలో ఉన్న సరుగుడు తోటలో ఆమె అచేతనంగా మృతి చెంది కనిపించింది. సమాచారం తెలుసుకున్న కె.కోటపాడు సీఐ సోమునాయుడు, మాడుగుల ఎస్ఐ దామోదరనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భవనీ మృతికి గల కారణాలపై భర్త ప్రకాశ్, వరహాలమ్మలను విచారిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

కశింకోట, మార్చి 17 : మండలంలోని తీడ గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసినట్టు రైటర్ సూర్యారావు తెలిపారు. ఆదివారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా గ్రామానికి చెందిన నలుగురు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్టు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.10,170లు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

19 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 17 : మండలంలోని ముత్యాలమ్మపాలెంకి చెందిన చింతకాయల సోములు ఆదివారం రాత్రి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 19 క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి ఇంటికి తీసుకు వెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. సోములుపై కేసు నమోదు చేశామన్నారు.

మూడేళ్ల చిన్నారిపై సాంబారు పడి తీవ్ర గాయం

ఎలమంచిలి, మార్చి 17: మండలంలోని లైనుకొత్తూరు కాలనీలో ఇంటిలో ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై ప్రమాదవశాత్తూ సాంబారు పడడంతో కాలిపోయి తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం తల్లి డి.జ్యోతి వంట చేస్తున్న సమయంలో చిన్నారి ఆడుకుంటుండగా సాంబారు మీద పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. అవసరమైన వైద్య సేవలు అందించామని వైద్య సిబ్బంది తెలిపారు.

గేట్‌లో అనకాపల్లి వాసికి 7వ ర్యాంకు

కొత్తూరు, మార్చి17 : గేట్ పరీక్షల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన తెలుగు తేజం 7వ ర్యాంకు సాధించాడు. అనకాపల్లి మండలం కొత్తూరు ఎన్జీవోస్ కాలనీలో నివాముంటున్న కర్రి పరమేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు కర్రి ఎస్‌డీఎస్‌వీజీ నాయుడు గేట్ పరీక్షలో ఏడో ర్యాంకు సాధించాడు. ఈయన ఆంధ్రా యూనివర్శిటీలో నావల్ ఆర్కిటెక్చర్ మెరైన్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఏడో ర్యాంకు సాధించిన నాయుడును తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.


నాయుడు

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

నిరుపయోగంగా ఆర్అండ్‌బీ అతిథిగృహం

మరమ్మతులకు చేయని వైసీపీ ప్రభుత్వం

- శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోని పాలకులు
- జిల్లా కేంద్రమైనప్పటికీ మారని పరిస్థితి
- హోటళ్లలోనే వీఐపీలు, ఉన్నతాధికారులు బస
- సర్క్యూట్ హౌస్ తరహాలో అభివృద్ధికి జీవీఎంసీ యత్నం
- అంగీకరించని ఆర్అండ్‌బీ అధికారులు


ఆర్అండ్‌బీ అతిథి గృహం

అనకాపల్లి టౌన్, మార్చి 17:
పట్టణంలోని గుండాలజంక్షన్‌లో ఉన్న రోడ్లు భవనాల శాఖ అతిథిగృహం నిరుపయోగంగా మారింది. ఈ అతిథిగృహం బ్రిటిష్ వారి హయాంలో నిర్మించింది. ఐదేళ్ల క్రితం వరకు ఎంతోమంది ప్రజాప్రతినిధులు, వీఐపీలకు సేద తీరేందుకు అవకాశం కల్పించిన ఈ అతిథిగృహం ఐదేళ్లుగా నిరుపయోగంగా మారింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ అతిథిగృహానికి మరమ్మతులు చేయించడం గాని, దీని స్థానే కొత్తది నిర్మించే ప్రయత్నం చేయలేదు. 2018 ఏడాదంతంలో ఈ అతిథిగృహాన్ని అప్పటి ఆర్అండ్‌బీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తుమ్మపాలలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యే ముందు సందర్శించారు. అతిథిగృహం పరిస్థితి చూసి రూ.రెండు కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. నిధులు విడుదలయ్యేలోపే ఎన్నికల షెడ్యూల్ రావడం, ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మంజూరైన నిధులన్నీ వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడంతో ఈ అతిథిగృహాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఈ అతిథి గృహం వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అనకాపల్లి జిల్లాగా ఏర్పడి రెండేళ్లు కావస్తున్నది. జిల్లా కేంద్రంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు అతిథులు వచ్చినప్పుడు వారి విడిదికి అతిథిగృహం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు హోటళ్లల్లో బస చేయాల్సి వస్తున్నది. ఇటీవల అనకాపల్లి వచ్చిన జీవీఎంసీ కమిషనర్ ఈ అతిథిగృహాన్ని కూడా పరిశీలించారు. జీవీఎంసీకి అప్పగిస్తే సర్క్యూట్‌హౌస్ ఏర్పాటుచేయాలనే ఆలోచనను వ్యక్తం చేశారు. అయితే ఆర్అండ్‌బీ అధికారులు అందుకు నిరాకరించినట్లు సమాచారం. జీవీఎంసీకి ఇచ్చి ఉంటే సుందరమైన సర్క్యూట్‌హౌస్ నిర్మాణమయ్యేదని పలువురు చెబుతున్నారు. గతంలో అతిథిగృహానికి ఆనుకుని జేఈ, సిబ్బంది కార్యాలయాలు ఉండేవి. ఆ భవనాలు కుప్పకూలిపోవడంతో అధికారులు కొద్దిరోజులు రెండో నంబరు అతిథిగృహం వద్ద విధులు నిర్వహించేవారు. అయితే భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు అనకాపల్లి జిల్లాగా ఏర్పడడంతో ఆర్అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో కొప్పాకలో ఏర్పాటైంది. అధికారులు అక్కడి నుంచే తమ విధులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల సీజన్ ప్రారంభమైంది. ఈ సమయంలో ఎన్నికల పర్యవేక్షకులు, ఉన్నతాధికారులు జిల్లా కేంద్రంలో పర్యటిస్తారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఉన్న ఏకైక ఆర్అండ్‌బీ అతిథిగృహం మూలకు చేరడంతో స్థానిక హోటళ్లల్లో వీఐపీలు ఉండాల్సి వస్తున్నది. ఏమైనా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అతిథిగృహం లేకపోవడం విశేషం. ఈ విషయమై ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా.. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరినందున తొలగించడం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని చెబుతున్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు!

- గెడ్డ, వాగుల నుంచి ఎడ్ల బండ్లపై తరలింపు
- పట్టించుకునేవారు లేకపోవడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు


ఏఎల్‌పురంలో ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, మార్చి 17: గొలుగొండ- కొయ్యూరు మండలాల సరిహద్దుల్లో గల బొడ్డేరు గెడ్డ, వాగుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. నిత్యం ఈ తంతు సాగుతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఫలితంగా పలువురు ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వుకుపోతూ రెండు చేతులా ఆర్జిస్తున్నారు. గొలుగొండ మండలం కొంగసింగి, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, రత్నంపేట గ్రామాలకు చెందిన సుమారు 120 వరకు ఎడ్ల బండ్లు ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. చోద్యం బొడ్డేరు గెడ్డ, కొయ్యూరు మండలం రామ్‌నగర్, కొత్తూరు తదితర వాగుల్లో ఈ తవ్వకాలు చేపడుతున్నారు. బండి ఇసుకను రూ.వెయ్యి చొప్పున అమ్మకాలు జరుపుతున్నారని అంటున్నారు. మండలంలో ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ తరలింపు మరింత జోరందుకుంది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్

అనకాపల్లి టౌన్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానికంగా ఒక హోటల్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆవరణలో జరిగిన బహిరంగసభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులను అభినందించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించిన వారి విజయానికి పనిచేయాలని ఆయన కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ, వైసీపీలతోపాటు టీడీపీ, జనసేన పార్టీలను చిత్తుగా ఓడించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తనకాల అనంతరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంవీఆర్ రాహుల్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు మలపరెడ్డి కోటేశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ


తాండవ చెక్‌పోస్టు వద్ద పోలీసులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పాయకరావుపేట, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, సారా, మత్తు పదార్థాలు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పోలీసులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక తాండవ షుగర్స్ సమీపంలో ఏర్పాటుచేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులతో మాట్లాడుతూ డబ్బు, ఉచిత కానుకలు రవాణాపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్, సీఐలు ధనుంజయరావు, పి.అప్పలరాజు ఉన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ అన్ని వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ అక్కడే ఉన్న తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ విజయ్‌కుమార్‌లకు పలు సూచనలు చేశారు.

ఎలమంచిలిలో.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం రాత్రి మండలంలోని రేగుపాలెం జంక్షన్ వద్ద స్థానిక అధికారులతో మాట్లాడారు. ఎలమంచిలి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిణి మనోరమ, సిబ్బందికి కలెక్టరు పలు సూచనలు చేశారు.


రేగుపాలెం జంక్షన్ వద్ద ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఘనంగా కొత్తమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 17: పూడి ఆర్ఆర్‌కాలనీలోని కొత్తమ్మతల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి మండప పూజలు, రత్నన్యాసములు అనంతరం విగ్రహ ప్రతిష్ఠ, కలశ స్థాపన వంటి క్రతువులు జరిగాయి. ఎమ్మెల్యే కన్నబాబురాజు, జనసేన నేత సుందరపు విజయకుమార్, టీడీపీ నేత ప్రగడ నాగేశ్వరరావు అమ్మవారికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. సాయంత్రం తోడపెద్దుల సేవ, గరిడి, చమురుకాల్పు, తప్పెటగుళ్ల కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా భారీగా బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో రాజాన నరసింగరావు, భైలపూడి శ్రీరామదాసు, కూండ్రపు వెంకునాయుడు, లాలం శ్రీను, పైల రామునాయుడు, దేశంశెట్టి శంకరరావు, పల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు



దిబ్బపాలెంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

అచ్యుతాపురం, మార్చి 17: మండలంలోని పూడిమడక, దిబ్బపాలెం, దొప్పెర్ల, మడుతూరు, తంతడిలో కేంద్ర బలగాలు ఆదివారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ బుచ్చిరాజు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించడం జరుగుతోందన్నారు .

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

సబ్బవరం, మార్చి 17 : మండలంలోని బంగారమ్మపాలెంలో ఈనెల 28న జరగనున్న ముత్యాలమ్మతల్లి పండగ సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను టీడీపీ నాయకులు దాడి కన్నంనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 40 టీంలు పాల్గొంటున్నాయని చెప్పారు. విజేతలకు వరసగా రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు నగదు బహుమతులు అనుపోత్సవం నాడు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఈ పోటీలను సర్పంచ్ దాడి లావణ్య, ఉత్సవ కమిటీ సభ్యులు దొడ్డి సోమేశ్వరరావు, శిలపరశెట్టి మాలినాయుడు, దొడ్డి రాజుకోటి, వీరఅప్పారావు, ఆడారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

» డీఎస్‌డబ్ల్యూవో అజయ్‌బాబు



టెన్త్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేసిన దృశ్యం

పాయకరావుపేట, మార్చి 17 : పదో తరగతి పరీక్షలు రాస్తున్న వసతిగృహాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని డీఎస్‌డబ్ల్యూవో అజయ్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ పార్కులోని ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతి రాస్తున్న 50 మంది హాస్టల్ విద్యార్థులకు అట్టలు, మెటీరియల్‌ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల పట్ల భయం వీడి ప్రశాంతంగా రాయాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్లు వి.బాబూరావు, బి.రమణమ్మ, కె.నాగార్జున, సీహెచ్.శ్రీను పాల్గొన్నారు.

'అన్ని రంగాల్లో వైసీపీ విఫలం'

మునగపాక (తుమ్మపాల), మార్చి 17: రాష్ట్రంలో అన్ని రంగాల్లో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి జనపరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక జనసేన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడం, కక్షసాధింపు చర్యలతో శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే గ్రావెల్ దందాలు చేస్తూ అక్రమ ఆదాయానికి అలవాటుపడ్డారని ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో సహా దిగువ స్థాయి నాయకుల సైతం పలు కంపెనీల యాజమాన్యాలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఏవీ సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలి

అనకాపల్లి టౌన్, మార్చి 17 : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో డంపింగ్‌యార్డును తొలగించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరుయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం జోనల్ కార్యాలయంలోని డంపింగ్‌యార్డు వద్ద నిరసన తెలియజేశారు. డంపింగ్‌యార్డు వలన పరిసర నివాసితులు, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అనకాపల్లి టౌన్, మార్చి 17 : పదో తరగతి పరీక్షలకు పట్టణంలోని 12 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థుల హాల్‌టికెట్ల నంబర్లను పాఠశాలల గదుల్లోని బెంచీలపై అంటించి సిద్ధం చేశారు. పట్టణంలోని జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాల, గాంధీనగరంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల, పట్టణ బాలికోన్నత పాఠశాలతోపాటు జేఎంజే, నారాయణ, భాష్యం, శ్రీచైతన్య ఏఎంఏఎల్ హైస్కూల్, తుమ్మపాల జడ్పీ హైస్కూల్, మామిడిపాలెం జడ్పీ హైస్కూల్, కూండ్రం జడ్పీ హైస్కూల్, కొప్పాక జడ్పీ హెస్కూల్‌లో జరిగే ఈ పరీక్షలకు 3,015 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఏఒక్క విద్యార్థి పరీక్షకు హాజరయ్యేటప్పుడు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరవాడలో.. పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో-1 దివాకర్‌రావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు ఆరు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరవాడ జడ్పీ బాలుర, బాలికోన్నత, సుమేధా, వాడచీపురుపల్లి, పెదముషిడివాడ, లంకెలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 1,131 మంది పరీక్షలు రాయనున్నారు.



బెంచీలపై నంబర్లు వేసి సిద్ధం చేసిన అధికారులు

ఎలమంచిలిలో.. పట్టణంలో పదో తరగతి పరీక్షలకు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట జడ్పీ హైస్కూలు, బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్ స్కూలు, శ్రీచైతన్య స్కూళ్లలో పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నాలుగు పరీక్షా కేంద్రాల్లో 922 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల్లో వెలుతురు, తాగు నీరు, వైద్య సదుపాయం కల్పించినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని టెన్త్ పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో ఏఎస్ఎస్ఏఎన్ మూర్తి తెలిపారు. ఎస్.రాయవరం జడ్పీ బాలుర హైస్కూల్, ధర్మవరం అగ్రహారం, కొరుప్రోలు, దార్లపూడి జడ్పీ హైస్కూళ్లు, అడ్డరోడ్డు తిమ్మాపురంలో ఉన్న ఆదర్శ ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో 1,121 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. పరీక్షల కోసం 57 మంది ఇన్విజిలేటర్స్, ఇద్దరు సిటింగ్ స్క్వాడ్‌ను నియమించారు. కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పీటీడీ బస్సులు

అనకాపల్లి టౌన్, మార్చి 17 : జిల్లాలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు అనకాపల్లి పీటీడీ డిపో నుంచి 13 బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు పీటీడీ అధికారులు తెలిపారు. ఆరు బడి బస్సులతోపాటు మరో ఏడు బస్సులను దేవరాపల్లి, నక్కపల్లి, కొక్కిరాపల్లి, తానాం, అనకాపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని విద్యార్థుల సౌకర్యార్థం నడపనున్నట్టు తెలిపారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు పదో తరగతి పరీక్షా హాల్ టికెట్ చూపిస్తే ఉచితంగా ఆయా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులను చేర్చుతామని తెలిపారు.

సోషల్ మీడియాలో జగన్‌రెడ్డి అవినీతిని ఎండగట్టండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, మార్చి 17: సోషల్ మీడియా వేదికగా జగన్‌రెడ్డి అవినీతి పాలనను, వైసీపీ నాయకుల అక్రమాలను బట్టబయలు చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సూచించారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన ఉమ్మడి పార్టీల సోషల్‌మీడియా సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గంలో వెయ్యి మందితో సోషల్‌మీడియా టీమ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ చేస్తున్న అసత్యప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గాజుగ్లాస్ గుర్తును ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అభ్యర్థుల గెలుపులో సోషల్ మీడియా వారియర్స్‌దే కీలకపాత్ర అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు వెళ్లిన నేతలు

నక్కపల్లి, మార్చి 17: చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాగళం సభకు మండలంలోని టీడీపీ నాయకులు తరలివెళ్లారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు, వాహనాల్లో టీడీపీ నాయకులు ప్రజాగళం సభకు వెళ్లారు. టీడీపీ మండలఅధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు కర్రి ఆంజనేయులు, వైబోయిన రమణ, నానేపల్లి రాఘవులు, కొరిమి సూర్యగణేశ్, ఎరుపిల్లి అప్పలరాజు, తదితరులు ఉన్నారు.

పాయకరావుపేటలో..

చిలకలూరిపేట టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాగళం సభకు పాయకరావుపేట నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లాయి. ఈ వాహనాలను టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు జెండా ఊపి ప్రారంభించారు. ప్రజాగళం సభకు వెళ్లిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు యాళ్ల వరహాలు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, ఎం.రమాకుమారి ఉన్నారు.



ప్రజాగళం సభకు పాయకరావుపేట నుంచి తరలివెళుతున్న టీడీపీ నాయకులు

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

» సీనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం పిలుపు

కొత్తూరు, మార్చి 17 : పేదల సంక్షేమంతోపాటు నీతి, నిజాయితీలతో ఆదర్శవంతమైన పాలనను అందించిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనిఇ అనకాపల్లి సీనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం పిలుపునిచ్చింది. ఆదివారం సత్యనారాయణపురంలోని సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో సంఘం సమావేశంలో ఎన్టీఆర్ లిటరేట్స్ అధ్యక్షుడు కర్రి దివాకరరావు మాట్లాడారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రారంభించి పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయానికి ఆయన పేరు మార్చడం సరికాదన్నారు. సీనియర్ నాయకుడు ధనాల విష్ణుచౌదరి మాట్లాడుతూ ఎన్‌టీఆర్ ప్రారంభించిన టీడీపీకి పూర్వవైభవం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత సీఐ పల్లా శ్రీనివాసరావు, సీనియర్ అభిమాని కర్రి శివన్నారాయణ, అనకాపల్లి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వేదుల వెంకటరామారావు, పెనుమత్స వెంకటేశ్వరరాజు, వానపల్లి త్రినాథ్, నెల్లూరు సాంబశివరావు, భోగలింగం,నాయుడు, శివాజీ, బుల్లిబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ లిటరేట్స్ అధ్యక్షుడు కర్రి దివాకర్

సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

... 5వ పేజీ తరువాయి

ఆదేశాల మేరకు మండల అధికారులు తమ పరిధిలో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను సత్వరమే తొలగించి, ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కిందిస్థాయి ఉద్యోగులకు హుకుం జారీ చేశారు. కొత్తపెంట సచివాలయం పరిధిలోని ఫ్లెక్సీలు తొలగించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి తన స్నేహితుడు దాసరి శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ములకలాపల్లి చేరుకున్నాడు. పాల కేంద్రానికి సమీపంలో వున్న ఒక ఫ్లెక్సీని చిరంజీవి తొలగిస్తుండగా.. దీని ఇనుప చట్రం, పైన వున్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలోని పొలాల్లో పనులు చేస్తున్న రైతులు, కూలీలు వచ్చారు. ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో తొలుత ఇసుక తీసుకువచ్చి అతని శరీరంపై పోశారు. (దీని వల్ల అతని శరీరం విద్యుత్ శక్తి తగ్గుతుందని...) సమీపంలో వున్న ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందిని రప్పించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్య సిబ్బంది చెప్పారు. మృతుడు చిరంజీవికి భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3), తల్లి కృష్ణమ్మ ఉన్నారు. హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా విద్యుదాఘాతంతో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి ఫోన్ చేసి కోరారు.



చిరంజీవి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి కృష్ణమ్మ

ఉపమాక జాతర 20 రోజులు



జాతర కోసం దుకాణాలు నిర్మించుకుంటున్న వ్యాపారులు

నక్కపల్లి, మార్చి 17: మండలంలోని ఉపమాకలో ఈనెల 19 నుంచి వేంకటేశ్వరస్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా తీర్థం జరగనుంది. ఈ జాతర 20 రోజులపాటు కొనసాగుతోంది. ఇందుకోసం వ్యాపారులు గత మూడు రోజుల నుంచి దుకాణాలను నిర్మించుకుంటున్నారు. ఈ తీర్థానికి వచ్చిన వారు ఇక్కడ విక్రయించే సుగంధ ద్రవ్యాలను తప్పకుండా కొనుగోలు చేశారు. సుమారు 10 మంది వ్యాపారులు కలిసి ఒక దుకాణం పెడతారు. ఇలా 10 దుకాణాలను వర్తకులు ఏర్పాటు చేస్తుంటారు. ఇవిగాక చిన్న పిల్లలు ఆడుకునే ఆట వస్తువుల నుంచి తినుబండారాలు, పలు వస్తు సామగ్రిల దుకాణాలు ఏర్పాటు చేస్తారు. వర్షం వచ్చినా ఇబ్బందుల్లేకుండా దుకాణాలను నిర్మించుకుంటున్నారు.

పక్కాగా కోడ్ అమలు

... 5వ పేజీ తరువాయి

వినియోగం, తదితర వాటికి సంబంధించి అన్ని రకాల అనుమతులు ఈ యాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. అనుమతి పొందిన పార్టీలు లేదా అభ్యర్థులు రోజూ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రచారం చేసుకోవాలని స్పష్టం చేశారు కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలు కంటే ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు తమ వద్ద తగిన ఆధారాలు వుంచుకోవాలని, లేకపోతే నగదును సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తొమ్మిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, ఇంకా మొబైల్ చెకింగ్ బృందాలు కూడా తిరుగుతాయని ఎస్పీ తెలిపారు. రానున్న రోజుల్లో అదనపు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడమే కాకుండా మొబైల్ తనిఖీ బృందాలను అదనంగా నియమిస్తామన్నారు. జిల్లాలో లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగిన వ్యక్తులు వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో అప్పగించాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఆయుధ లైసెన్సులు పొంది, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో నివసిస్తున్న వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుందని ఎస్పీ మురళీకృష్ణ స్పష్టం చేశారు.

చెక్ పోస్టులను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అయిన రవిపట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం రాత్రి అనకాపల్లి- పాయకరావుపేట మధ్య ఏర్పాటు చేసిన పలు చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఎలమంచిలి మండలం రేగుపాలెం జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. నక్కపల్లి మండలం వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద చెక్ పోస్టును సందర్శించారు. ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పాయకరావుపేటలో తాండవ షుగర్స్ సమీపంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, సారా, గంజాయితోపాటు భారీ మొత్తంలో డబ్బు రవాణాను అరికట్టేందుకు వాహనాల తనిఖీ ముమ్మరంగా చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు.

శభాష్ 'మేధ'ర్షి

» సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో నునపర్తి విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్

అచ్యుతాపురం, మార్చి 17: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సైనిక్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వ హించిన పరీక్షలో మండలంలోని నునపర్తి గ్రామానికి చెందిన రెడ్డి మేధర్షి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది జనవరి 28వ తేదీన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించగా, ఈ నెల 14వ తేదీన ఫలితాలు వెల్లడయ్యాయి. రెడ్డి మేధర్షి 283/300 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 43వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. తల్లి దండ్రులు రాజేశ్, స్వర్ణలత ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో వుంటున్నారు. మేధర్షి రెగ్యులర్ పాఠశాలకు వెళుతూనే, ఆన్‌లైన్లో వైజాగ్ సైనిక్ అకాడమీ సెంటర్లో కోచింగ్ తీసుకున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు.



కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేస్తున్న ర్యాంకు సాధించిన మేధర్షి రెడ్డి

కోడ్ అమలులో వివక్ష!

... 5వ పేజీ తరువాయి

అధికారులు తొలగించలేదు. కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లో (ఆదివారం సాయంత్రం మూడు గంటల కల్లా) ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన హోర్డింగులు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, తదితర వాటిని తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈ ఆదేశాలను పరవాడలో అమలు చేయలేదు. బొంకులదిబ్బవీధి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా, మండల పరిషత్ జంక్షన్ వద్ద వైసీపీ, టీడీపీ ప్రచార హోర్డింగ్‌లు దర్శనమిస్తున్నాయి. సంతబయలు వద్ద కొన్నింటిని మాత్రమే తొలగించారు.



అనకాపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మపై తొలగించని వైసీపీ రంగులు, ఫ్యాన్ బొమ్మలు

పూర్వ విద్యార్థుల సందడి

మాడుగుల, మార్చి 17 : మోదకొండమ్మ ఆలయం వద్ద అనకాపల్లికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. గవరపాలెం మునిసిపల్ హైస్కూల్‌లో 1984- 85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 80మంది వరకు కలుసుకుని సందడి చేశారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

'కాకతీయ' ప్రతినిధులను కలిసిన కొణతాల, పీలా



కాకతీయ సంఘం ప్రతినిధులతో కొణతాల, పీలా

కొత్తూరు, మార్చి 17 : అనకాపల్లి కాకతీయ సంఘం ప్రతినిధులను ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం కలిశారు. అనకాపల్లి పూడిమడక కూడలి సమీపంలో ఉన్న ఒక నివాసంలో కాకతీయ సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా పోటీ చేస్తున్నామని, ఎన్నికల్లో మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి చౌదరీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఓరుగంటి రాఘవరావు, అధ్యక్షుడు కాకర్ల రమేష్, కార్యదర్శి కొల్లి శ్రీను, ట్రెజరర్ ధనాల వెంగళరావు పాల్గొన్నారు.

భక్తులతో నూకాంబిక ఆలయం కిటకిట



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 17: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మరో 20 రోజుల్లో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. పలువురు అమ్మవారి పండగలను జరుపుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పాలకవర్గం, అధికారులు చర్యలు చేపట్టారు.

తాకాశివీధి నూకాంబిక జాతర రాట ముహూర్తం

అనకాపల్లి టౌన్, మార్చి 17: స్థానిక తాకాశివీధిలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ముహూర్తం రాటను ఆదివారం వేశారు. ఆలయ ఛైర్మన్ తాకాశి రాజేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి రాటను వేశారు. జాతరకు సంబంధించిన పనులను ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాకాశి కన్నబాబు, తాకాశి చందు, పెద్దలు పాల్గొన్నారు.

'సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వేగవంతం'

అనకాపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలో వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌లలో సిమెంట్ రోడ్డు పనులు, డ్రైనేజీల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ విభాగం ఈఈ జేసీపీ సింగ్ తెలిపారు. సంపతిపురంలో మూడు, కుంచంగిలో మూడు లేఅవుట్‌లతోపాటు వేటజంగాలపాలెంలో ఒక లేఅవుట్‌లో రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రూ.12 కోట్లతో జరుగుతున్న నిర్మాణ పనులకు సంబంధించి భూమి చదును పూర్తయిందన్నారు. మూడు నెలల్లో సీసీ రోడ్డు పనులు, డ్రైన్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. రూ.50 లక్షలతో రావుగోపాలరావు కళాక్షేత్రంలోని మౌలిక వసతుల కల్పన, మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులు కూడా ఇప్పటికే సగం పూర్తయ్యాయని, మిగిలిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, మార్చి 17: స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భద్రావతి సమేత భావనారాయణస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవానికి టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ హాజరై స్వామివార్లను దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పంపాన సత్యనారాయణ, ప్రతినిధులు దొడ్డిఈశ్వరరావు, వానపల్లి రామ్మోహనరావు, తిప్పాన అప్పారావు, కాకి ధర్మారావు, కాకి ఫైడిరాజు, దొడ్డి చిన్నారావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అంధకారం

నక్కపల్లి, మార్చి 17: మండలంలోని ఉపమాక జగనన్న కాలనీలో 15 రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రయితే విష సర్పాలు సంచరిస్తున్నాయని, అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలనికాలనీవాసులు కోరుతున్నారు.

ఆలయాల్లో పక్షులకు వరికుంచులు

అనకాపల్లి టౌన్, మార్చి 17 : వేసవిలో పక్షుల కోసం పలు ఆలయాల్లో ఆదివారం ధాన్యపు కుంచులు, నీళ్ల తాగే మట్టి పాత్రలు, పక్షుల గూళ్లను గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆలయాల్లో 58 ధాన్యపు కుంచులు, మట్టి నీటిపాత్రలు, గూళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, ఆళ్ల నాగేశ్వరరావు, విల్లూరి ఫైడారావు, డాక్టర్ గణేష్, వి.వినోద్‌కుమార్, కర్రి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బండారుకు మద్దతుగా టీడీపీ బైక్ ర్యాలీ



పరవాడలో నిర్వహించిన బైక్ ర్యాలీ

పరవాడ, మార్చి 17: పెందుర్తి అసెంబ్లీ సీటును టీడీపీకి కేటాయించి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తికి టిక్కెట్ ఇవ్వాలంటూ ఆ పార్టీ శ్రేణులు ఆదివారం మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీ పెద ముషిడివాడ నుంచి లంకెలపాలెం ఫార్మాసిటీ, మండల పరిషత్ జంక్షన్, పరవాడ మీదుగా వెన్నెలపాలెం వరకు కొనసాగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు గొర్లి కనకారావు, పైలా చినఅక్కునాయుడు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. పెందుర్తి ఎమ్మెల్యే సీటు టీడీపీకి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పెందుర్తి, సబ్బవరం మండలాలకు చెందిన నాయకులు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెన్నెలపాలెం వెళ్లి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి సంఘీభావం తెలిపారు. ఈ ర్యాలీలో టీడీపీ నేతలు భరణికాన బాబూరావు, కొటాన అప్పారావు, బుచ్చిరాజు, దొడ్డి ప్రకాశరావు, మడక పార్వతి, కరక దేముడు, దాట్ల మధు, రోమాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీపీఎం ఉద్యమాలకు లక్ష విరాళం

అచ్యుతాపురం, మార్చి 17: మండలంలోని హరిపాలెం గ్రామస్థులు సీపీఎం ప్రజా ఉద్యమాల కోసం రూ.లక్ష విరాళాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథంకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.రాము, బి.రామ్‌కుమార్, కె.రామసదాశివరావు, ఎస్.కన్నూంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో రోబో ఇసుకతో రోడ్లు

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆరోపణ
- కాంట్రాక్టర్ నుంచి ఎంత కమీషన్ తీసుకున్నారని ఎమ్మెల్యేకు సూటి ప్రశ్న
- రాజధాని లేని రాష్ట్రాన్ని పరిపాలించడానికి సీఎంకు సిగ్గు లేదా అని ఎద్దేవా
- వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానం



పెదబొడ్డేపల్లి ఎస్సీ కాలనీలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మార్చి 17 : టీడీపీ ప్రభుత్వం ఇసుక, సిమెంటుతో రోడ్లు వేస్తే.., వైసీపీ ప్రభుత్వంలో రోబో ఇసుకతో రోడ్లు వేస్తున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. పట్టణంలోని 12వ వార్డు పెదబొడ్డేపల్లి ఎస్సీ కాలనీలో వైసీపీ నుంచి యాదగిరి దాసుతో సహా పలువురు ఆదివారం టీడీపీలో చేరారు. వీరికి అయ్యన్న కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం మాట్లాడారు. మెయిన్ రోడ్డు పనులు కూడా రోబో ఇసుకతో వేస్తున్నారని ఆరోపిస్తూ, కాంట్రాక్టర్ నుంచి ఎంత కమీషన్ తీసుకుంటున్నారని ఎమ్మెల్యేను ఉద్దేశించి ప్రశ్నించారు. రాజధాని లేని రాష్ట్రాన్ని పరిపాలించడానికి ముఖ్యమంత్రికి సిగ్గు లేదా.. అని ఎద్దేవా చేశారు. దేశంలో రాజధాని లేనిది మన రాష్ట్రం ఒక్కటే ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆరాచక పాలనను ప్రశ్నించినందుకు తనపై 16 కేసులు పెట్టారని తెలిపారు. అర్ధ రాత్రి వెయ్యి మంది పోలీసులు తన ఇంటి గోడలు దూకి తనను అరెస్టు చేసి తీసుకు వెళ్లారని అయ్యన్న వివరించారు. దొంగపనులు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని వదిలేసి, ఏ తప్పు చేయని తనని అన్యాయంగా అరెస్టు చేశారని వాపోయారు. 67 ఏళ్ల వయస్సులో ఉన్న తనపై పోలీసులు నిర్భయ కేసు పెట్టారని, ఇంతకంటే అన్యాయం ఎక్కడైనా ఉందా అని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల తర్వాత అక్రమార్కులు జైలుకు పోవడం ఖాయన్నారు. రాష్ట్రాన్ని మొత్తం దోచుకు తిన్నారని వైసీపీ నాయకులను ఉద్దేశించి అన్నారు. ఇసుక, గ్రావెల్‌తవ్వేసుకొని అమ్మేసుకున్నారని ఆరోపించారు. పాదయాత్రలో ప్రత్యేక హోదా, రైల్వేజోన్ తెస్తానని హామీ ఇచ్చి, గెలిచిన తర్వాత ఎందుకు తేలేదని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు చేస్తానని రాష్ట్రంలో 60 లక్షల మంది ఉద్యోగులను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను ప్రజలంతా ఆశీర్వదించాల్సిందిగా కోరారు. 12వ వార్డులో యాదగిరి దాసుతో పాటు 70 కుటుంబాలు టీడీపీలోకి చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, పార్టీ పట్టణ కార్యదర్శి గవిరెడ్డి వెంకట రమణ, చిటికెల కన్నయ్యనాయుడు, దశరథ్, కౌన్సిలర్ రాజునాయుడులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాతవరం మండలం కేఆర్‌సీపురం ఎన్నికల శంఖారావం సభలో ప్రసంగిస్తున్న అయ్యన్నపాత్రుడు



కేఆర్‌సీపురంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

'చెరకు రైతుల ఉసురు వైసీపీ ప్రభుత్వానికి తగులుతుంది'

నాతవరం : తాండవ చక్కెర కర్మాగారం పరిధిలో ఉన్న చెరకు రైతుల ఉసురు వైసీపీ ప్రభుత్వానికి తగులుతుందని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం రాత్రి నాతవరం మండలం కేఆర్‌సీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. జగన్ పాదయాత్ర చేసినప్పుడు తాండవ షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరణ చేస్తామని చెప్పి, నేడు ఫ్యాక్టరీని మూసేయడంతో చెరకు రైతులు రోడ్డున పడ్డారన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఎన్నెన్నో హామీలను ఇచ్చి, వాటిని అమలు చేయడంతో జగన్ విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగన్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలంతా ఓటుతో బుద్ధి చెప్పి ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయని, ఈ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో ప్రజలంతా గెలిపించాల్సిందిగా కోరారు. అంతకు ముందు గ్రామంలో ఇరవై కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరడంతో వారికి అయ్యన్న కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, జనసేన నాయకులు రాజాన వీరసూర్యచంద్రతో పాటు ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎన్నాళ్లీ ట్రాఫిక్ కష్టాలు..?

- చోడవరం- దేవరాపల్లి రోడ్డులో తరుచూ ఇదే సమస్య
- పట్టించుకోని పోలీసులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు



చోడవరంలోని లక్ష్మమ్మగుడి వద్ద వాహనాలు నిలిచిపోవడంతో స్థానికుల కష్టాలు

చోడవరం, మార్చి 17 : పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి దేవరాపల్లి వెళ్లే రహదారిలో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పరిష్కారం చూపేవారు లేకపోడంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు జంక్షన్ నుంచి వెలమ వీధి, పెదబజారు, అన్నవరం వెంకయ్యగారి పేట మీదుగా దేవరాపల్లి వెళ్లే రహదారి ఇరుకుగా మారింది. ఈ రోడ్డులో భారీ వాహనాలు తిరుగుతుండడం, రోడ్డుపైనే పలువురు ఇష్టారాజ్యంగా వాహనాలను నిలిపివేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇటీవల లక్ష్మమ్మ గుడి వద్ద ట్రాఫిక్‌లో రెండు లారీలు, ఒక బస్సు రోడ్డుకు అడ్డంగా ఉండిపోవడంతో ట్రాఫిక్ చాలాసేపు నిలిచిపోయింది. ఇటువంటి సమస్య తరచూ తలెత్తుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని అక్కడివారు వాపోయారు. ఈ సమయంలో వివిధ పనులపై పట్టణానికి వచ్చిన వారితో పాటు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసుల అధికారులు స్పందించి దేవరాపల్లి రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు తొలగించేలా చర్యలు చేపట్టాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

సబ్బవరం, మార్చి 17 : మండలంలోని బంగారమ్మపాలెంలో ఈనెల 28న జరగనున్న ముత్యాలమ్మతల్లి పండగ సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను టీడీపీ నాయకులు దాడి కన్నంనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 40 టీంలు పాల్గొంటున్నాయని చెప్పారు. విజేతలకు వరసగా రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు నగదు బహుమతులు అనుపోత్సవం నాడు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఈ పోటీలను సర్పంచ్ దాడి లావణ్య, ఉత్సవ కమిటీ సభ్యులు దొడ్డి సోమేశ్వరరావు, శిలపరశెట్టి మాలినాయుడు, దొడ్డి రాజుకోటి, వీరఅప్పారావు, ఆడారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి



చిరంజీవి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి కృష్ణమ్మ

... 5వ పేజీ తరువాయి

ఆదేశాల మేరకు మండల అధికారులు తమ పరిధిలో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను సత్వరమే తొలగించి, ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కిందిస్థాయి ఉద్యోగులకు హుకుం జారీ చేశారు. కొత్తపెంట సచివాలయం పరిధిలోని ఫ్లెక్సీలు తొలగించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి తన స్నేహితుడు దాసరి శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ములకలాపల్లి చేరుకున్నాడు. పాల కేంద్రానికి సమీపంలో వున్న ఒక ఫ్లెక్సీని చిరంజీవి తొలగిస్తుండగా.. దీని ఇనుప చట్రం, పైన వున్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలోని పొలాల్లో పనులు చేస్తున్న రైతులు, కూలీలు వచ్చారు. ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో తొలుత ఇసుక తీసుకువచ్చి అతని శరీరంపై పోశారు. (దీని వల్ల అతని శరీరం విద్యుత్ శక్తి తగ్గుతుందని...) సమీపంలో వున్న ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందిని రప్పించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్య సిబ్బంది చెప్పారు. మృతుడు చిరంజీవికి భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3), తల్లి కృష్ణమ్మ ఉన్నారు. హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా విద్యుదాఘాతంతో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి ఫోన్ చేసి కోరారు.

గ్యాస్ కనెక్షన్ల మంజూరుకు గిరిజనుల ఆందోళన



లోసింగిలో ఆందోళన చేపడుతున్న గిరిజనులు

రోలుగుంట, మార్చి 17 : ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని లోసింగిలో పలువురు గిరిజన మహిళలు ఆదివారం ఆందోళన చేపట్టారు. గత ఏడాది డిసెంబరులో చలిసింగం, లోసింగి గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల కోసం మాకవరపాలెంలో గల ఓ గ్యాస్ ఏజెన్సీలో ఈకేవైసీ చేయించుకున్నట్టు చెప్పారు. కానీ ఇంతవరకు కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. దీనిపై అధికారులు విచారణ జరిపి మంజూరు చేయాల్సిందిగా కోరారు. అలాగే పెదగరువు గ్రామంలో కొంత మంది మహిళల వద్ద నుంచి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని డబ్బులు వసూళ్లు చేశారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి తదితరులు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యల తీసుకోవాల్సిందిగా కోరారు.

కె.కోటపాడు, చౌడువాడలో పోలీసులు కవాతు



కె.కోటపాడులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలతో పాటు, స్థానిక పోలీసులు

కె.కోటపాడు, మార్చి 17 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా కె.కోటపాడు, చౌడువాడ గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలు ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. తొలుత సీఐ స్వామినాయుడు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కె.కోటపాడు, ఎ.కోడూరు ఎస్ఐలు లక్ష్మీనారాయణ, జె.రమేష్, ఏఎస్ఐ రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో పూర్వ విద్యార్థులు సందడి

మాడుగుల, మార్చి 17 : మండల కేంద్రం మాడుగుల మోదకొండమ్మ ఆలయం వద్ద అనకాపల్లికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. గవరపాలెం మునిసిపల్ హైస్కూల్‌లో 1984- 85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న సుమారు 80మంది వరకు కలుసుకుని సందడి చేశారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సమావేశమై నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు పీవీ రమణ, అధ్యక్షుడు కేవీ నాగేశ్వరరావు, మల్ల స్వామి, ఆడారి పైడిరాజు, వెంపలి రంగ, ఎల్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు'



డీటీ, పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న నాగ మోహన్‌రావు

రోలుగుంట, మార్చి 17 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అంతా సహకరించాల్సిందిగా ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి నాగ మోహన్ రావు కోరారు. ఈ మేరకు ఆదివారం డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్‌ను కలిసి ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయా కేంద్రాల్లో చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా సిబ్బంది చైతన్య పర్చాలన్నారు. ఎవరైనా ప్రలోభాలు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'గేట్'లో రైతు కుమార్తెకు 171వ ర్యాంకు



నాగ వెంకట సంధ్యకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు వెంకట రమణమ్మ,సన్యాసిరావు

రావికమతం, మార్చి 17 : 'గేట్'లో రావికమతం మండలం గుమ్మాళ్ళపాడు గ్రామానికి చెందిన కాళింగ నాగ వెంకట సంధ్య 171వ ర్యాంక్ సాధించింది. శనివారం ఈ ఫలితాలు విడుదలయ్యాయి. సాధారణ రైతు కుటుంబానికి చెందిన సంధ్య మొదటి ప్రయత్నంలోనే ఈ విజయం సాధించడంతో ఆమె తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాళింగ సన్యాసిరావు, వెంకట రమణమ్మ దంపతుల రెండవ కుమార్తె అయిన సంధ్య పదో తరగతి వరకూ చినపాచిల ప్రభుత్వ పాఠశాలలో చదివి 9.3 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించింది. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం పూర్తిచేసింది. గేట్ పరీక్షకు హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకొని మొదటి ప్రయత్నంలోనే ప్రొడక్షన్ ఇంజనీరింగ్ విభాగంలో ఆలిండియా స్థాయిలో జనరల్ కేటగిరిలో ఈ ర్యాంకు ఈ ర్యాంకు పొందింది. ప్రస్తుతం ఆర్ఆర్‌బీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న తనకు అనుకూలమైన సీటు వస్తే పీజీ చేస్తానని ఆమె విలేకరులకు వివరించింది.

ఘనంగా పునీత్ రాజ్‌కుమార్ జయంతి

- చోడవరంలో 98 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న పునీత్ రాజ్‌కుమార్ అభిమానులు

చోడవరం, మార్చి 17 : కన్నడ సూపర్ స్టార్ దివంగత పునీత్‌రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని నూకాంబిక కల్యాణ మండపంలో అతని అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పునీత్ రాజ్‌కుమార్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 98మంది దాతలు స్వచ్ఛందంగ రక్తాన్ని దానం చేశారు. లలితాదేవి ఆశ్రమ నిర్వాహకురాలు వెంకటలక్ష్మి, సింగంపల్లి రవికుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాజ్‌కుమార్ అభిమాన సంఘం ప్రతినిధులు గొలుగొండ గణేశ్, ఎస్.శ్రీను, బీల సతీష్, తప్పెట్ల గణేష్‌కుమార్, పప్పు రాజు, సాయి ఈశ్వర్, చందక దాసు, ఎంఎం సాయి, పవన్, అనిల్‌కుమార్, బొబ్బిలి నాయుడులతో పాటు స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

చోడవరం/బుచ్చెయ్యపేట/ మాడుగుల/ దేవరాపల్లి/చీడికాడ/ కె.కోటపాడు/ గొలుగొండ/కృష్ణాదేవిపేట, మార్చి 17 : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆయా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితరాలను సిద్ధం చేశారు. బెంచీలను శుభ్రపర్చి వాటిపై హాల్‌టిక్కెట్ల నంబర్లు వేశారు. చోడవరం మండలంలో గోవాడ, లక్కవరంతో పాటు చోడవరంలో మరో నాలు కేంద్రాలు సిద్ధం చేశామని ఎంఈవోలు ఎస్.జయలక్ష్మి, కె.సింహాచలం తెలిపారు. ఈ ఆరు కేంద్రాల్లో మొత్తం 1281మంది పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. మాడుగుల మండలంలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈవోలు బి.దేముడమ్మ, పాండురంగారావు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలంలో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈవోలు ఎస్.జయలక్ష్మి, ఈ.కె.ఎస్.విశ్వేశ్వరరావు తెలిపారు. తొమ్మిది జడ్పీ హైస్కూళ్ల విద్యార్థులతో పాటు వడ్డాది కేజీబీవీ విద్యార్థులు మొత్తం 654 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఇందు కోసం వడ్డాది కేపీడీ జడ్పీ హైస్కూల్, దిబ్బిడి జడ్పీ హైస్కూల్, కళింకోట మండలం పంగిడి జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలుగా సిద్ధం చేసినట్టు చెప్పారు. మాడుగుల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్‌సీఎం బాలికల ఉన్నత పాఠశాలతో పాటు కేజే పురం, ఒమ్మలి జడ్పీ ఉన్నత పాఠశాల, తాటిపర్తి జీటీడబ్ల్యూ ఏహెచ్‌ఎస్‌లలో మొత్తం 682 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు వివరించారు. దేవరాపల్లి మండలంలో తెనుగుపూడి, దేవరాపల్లిలలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈవో బి.పడాల్‌దాస్ తెలిపారు. ఇక్కడ 443 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు వివరించారు. కె.కోటపాడు మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కె. కోటపాడు జడ్పీహెచ్ఎస్, అయ్యన్న ఇంగ్లీషు మీడియం, ఎ. కోడూరు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో 572 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కానున్నారు. మరో 21 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షల్లో రాయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవోలు సత్యనారాయణ, కె.ప్రసాద్ తెలిపారు. ఇదిలావుంటే, గొలుగొండ మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. గొలుగొండ ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్, చీడిగుమ్మల జిల్లా పరిషత్ హైస్కూల్, కృష్ణాదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 602 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. చీడికాడ మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈవో కె.బొంజుబాబు తెలిపారు. మంచాలలోని ఏపీ మోడల్ స్కూల్, కోనాం గురుకుల బాలికల పాఠశాల, చీడికాడ హైస్కూల్‌లో 493మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు.

శభాష్ 'మేధ'ర్షి

- సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో రెడ్డి మేధర్షికి జాతీయస్థాయిలో 43వ ర్యాంకు

అచ్యుతాపురం, మార్చి 17: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సైనిక్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వ హించిన పరీక్షలో మండలంలోని నునపర్తి గ్రామానికి చెందిన రెడ్డి మేధర్షి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది జనవరి 28వ తేదీన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ ప్రవేశ పరీక్ష నిర్వ హించగా, ఈ నెల 14వ తేదీన ఫలితాలు వెల్లడయ్యాయి. రెడ్డి మేధర్షి 283/300 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 43వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు రాజేశ్, స్వర్ణలత ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో వుంటున్నారు. మేధర్షి రెగ్యులర్ పాఠశాలకు వెళుతూనే, ఆన్‌లైన్లో వైజాగ్ సైనిక్ అకాడమీ సెంటర్లో కోచింగ్ తీసుకున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు.

కోడ్ అమలులో వివక్ష!



అనకాపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మపై తొలగించని వైసీపీ రంగులు, ఫ్యాన్ బొమ్మలు

... 5వ పేజీ తరువాయి

అధికారులు తొలగించలేదు. కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లో (ఆదివారం సాయంత్రం మూడు గంటల కల్లా) ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన హోర్డింగులు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, తదితర వాటిని తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈ ఆదేశాలను పరవాడలో అమలు చేయలేదు. బొంకులదిబ్బ వీధి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా, మండల పరిషత్ జంక్షన్ వద్ద వైసీపీ, టీడీపీ ప్రచార హోర్డింగ్‌లు దర్శనమిస్తున్నాయి. సంతబయలు వద్ద కొన్నింటిని మాత్రమే తొలగించారు.

పక్కాగా కోడ్ అమలు

... 5వ పేజీ తరువాయి

వినియోగం, తదితర వాటికి సంబంధించి అన్ని రకాల అనుమతులు ఈ యాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. అనుమతి పొందిన పార్టీలు లేదా అభ్యర్థులు రోజూ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రచారం చేసుకోవాలని స్పష్టం చేశారు కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలు కంటే ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు తమ వద్ద తగిన ఆధారాలు వుంచుకోవాలని, లేకపోతే నగదును సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తొమ్మిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, ఇంకా మొబైల్ చెకింగ్ బృందాలు కూడా తిరుగుతాయని ఎస్పీ తెలిపారు. రానున్న రోజుల్లో అదనపు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడమే కాకుండా మొబైల్ తనిఖీ బృందాలను అదనంగా నియమిస్తామన్నారు. జిల్లాలో లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగిన వ్యక్తులు వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో అప్పగించాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఆయుధ లైసెన్సులు పొంది, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో నివసిస్తున్న వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుందని ఎస్పీ మురళీకృష్ణ స్పష్టం చేశారు.

చెక్ పోస్టులను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అయిన రవిపట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం రాత్రి అనకాపల్లి- పాయకరావుపేట మధ్య ఏర్పాటు చేసిన పలు చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఎలమంచిలి మండలం రేగుపాలెం జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. నక్కపల్లి మండలం వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద చెక్ పోస్టును సందర్శించారు. ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పాయకరావుపేటలో తాండవ షుగర్స్ సమీపంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, సారా, గంజాయితోపాటు భారీ మొత్తంలో డబ్బు రవాణాను అరికట్టేందుకు వాహనాల తనిఖీ ముమ్మరంగా చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు.